ప్రతి ఉద్యోగి లక్ష్యాన్ని చేరుకోవాలి..

జైనాథ్, ఏప్రిల్ 18 : ప్రతి ఉద్యోగి లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్ అన్నారు. గురువారం పట్టణంలోని లక్ష లక్ష్యం కార్యక్రమాన్ని జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 ఉగాది ఉంచి 2025 ఉగాది వరకు ప్రతిరోజు డిపోకు ఒక లక్ష అదనపు ఆదాయం తీసుకు రావాడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో ఏఎంఎఫ్ చందు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్

ఆదర్శ కమిటీలతోనే అభివృద్ధి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

చించోలి(బి)లో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

సారంగాపూర్, ఏప్రిల్ 18 : ప్రభుత్వ పాఠశాలలు అమ్మ ఆదర్శ కమిటీలతోనే అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నా రు. గురువారం చించోలి(బి), ఆలూర్, ధని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో తాగునీరు, కరెంట్, మూత్రశాలల్లో చిన్నచిన్న మరమ్మతులు ఉంటే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పరిష్కరించాలన్నారు. అలాగే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. నర్సరీల్లో రోజు మొక్కలకు నీళ్లు పోసి కాపాడాలని సూచించారు. పాఠశాలల్లో ఆగిన పనులు జూన్ వరకు పూర్తి చేయాలన్నారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఈఈ శంకరయ్య, విద్యాధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

గెలుపు మనదే..

బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కుకు బీ-ఫారం అందజేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

అత్రం సక్కుకు బీ-ఫారం అందచేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఆదిలాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) :ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కుకు బీ-ఫారం అందజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రమాదేవి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాదేవార్ పాల్గొన్నారు

మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం..

- వ్యవసాయ వాడకం తగ్గింది..
- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ జైవంత్‌రావు చౌహాన్

ఆదిలాబాద్ ఎస్ఈ జైవంత్‌రావు చౌహాన్

ఆదిలాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన కరెంటు సరఫరా చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జైవంత్‌రావు చౌహాన్ తెలిపారు. జిల్లాలో ఒక 220 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, మూడు 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు 50 ఉన్నట్లు తెలిపారు. వీటితోపాటు 9,871 డీపీఆర్‌లు ఉన్నాయన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక చర్య లు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్‌లో కొత్తగా నాలుగు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు.. ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడలో రెండేసి చొప్పున ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2,09,183 గృహ విద్యుత్ కనెక్షన్లు, 32,030 వ్యవసాయ కనెక్షన్లు, 25,660 వాణిజ్య, 12,053 చిరు వ్యాపారుల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా గృహ వినియోగం పెరిగిందని, ప్రజల అవసరాల మేరకు కరెంటు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రోజు 1.52 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా అవుతుండగా అన్ని కనెక్షన్లు కలిపి 1.47 మిలియన్ యూనిట్ల వాడకం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గిందని తెలిపారు. గాలి, దుమారం, ఇతర కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా గత నెలలో 81,566 మంది వినియోగదారులకు జీరో బిల్లులు పంపిణీ చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యలపై సంబంధిత మండలాల అధికారులను సంప్రదించాలని ఎస్ఈ కోరారు.

తొలి రోజు రెండు

- ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గురువారం ప్రారంభమైంది. లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం నుంచి ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తీసుకోనున్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి చాంబర్ ఏర్పాటు చేశారు. పటిష్ట పోలీసు బందోబస్తు తోపాటు వంద మీటర్ల లోపు నిబంధనలు పాటించేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాథోడ్ సుభాష్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా శ్యాంలాల్ నాయక్‌లు నామినేషన్‌లు వేశారు. రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు తమ నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ల గడువు 25 వరకు ఉన్నందునా ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇతర పార్టీలకు చెందిన వారు మంచిరోజు చూసుకుని తమ నామపత్రాలు దాఖలు చేసే అవకాశం ఉంది. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్‌లు వేసే అవకాశం ఉంటుంది.

ఆధార్ పార్టీ నుంచి మాలోత్ శ్యామ్‌లాల్ నాయక్ నామినేషన్ పత్రాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నామినేషన్లు...భారీగా బందోబస్తు

ఎదులాపురం, ఏప్రిల్ 18 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల గురువారంతో ప్రారంభంఅయ్యాయి. దీంతో కలెక్టరేట్‌కు వంద మీటర్ల వరకు బారీ గేట్‌లు ఏర్పాటు చేసి పోలీసులు మోహరించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్ ముందు నుంచి సామన్య ప్రజలకు ఎవరికి అనుమతి లేదు. కార్యాలయంలో పని చేస్తున్న వారికి ప్రత్యేక కార్డు చూసి లోనికి అనుమతించారు. ఈ సమయంలో ట్రాఫిక్‌ను మరో రోడ్డుకు మళ్లించారు. జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అదేశాల మేరకు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి బందొబస్తును పరిశీలించారు. ఈమేరకు సిఐలకు, సిబ్బంది సలహాలు సూచనలు చేశారు. సిఐలు ఏ.అశోక్, ప్రణయ్‌కుమార్ ఉన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడి రాక

ఎదులాపురం, ఏప్రిల్ 18 : ఎన్నికల వ్యయ పరిశీలికుడు జాదావార్ వివేకానంద గురువారం ఆదిలాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ మేరకు స్థానిక పెన్ గంగాగెస్ట్ హౌస్‌లో ఆయనకు కలెక్టర్ రాజర్షి షా పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అలాగే ఎస్పీ గౌష్ ఆలం కూడా కలిశారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం..

కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 18 : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు ఎస్పీ క్రాంతిలాల్ జిల్లా అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 7,36,642 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఇందులో మహిళలు 3,81,664.. పురుషులు 3,54, 925.. ఇతరులు 50 మంది ఉన్నారన్నారు. 925 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందు లో 669 లొకేషన్‌లను గుర్తించామని తెలిపారు. 90 రూట్‌లు, ఎన్నికల పరిశీలనకు ప్రత్యేకంగా వివిధ టీంలను ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఆదిలాబాద్‌లో స్వీకరిస్తారని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులను తక్షణం స్వీకరించి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీ క్రాంతిలాల్ పాటిల్ మాట్లాడు తూ.. ఇప్పటికే జిల్లాకు పోలీస్ భద్రత దళాలు చేరుకున్నాయని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు రూ.1.89 కోట్ల నగదు, రూ.10 లక్షల విలువ చేసే మద్యం పట్టుకున్నామన్నారు. 278 మందిని బైండోవర్ చేశామని వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీపీఆర్‌వో విష్ణు వర్ధన్, అధికారులు రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి, నాగమణి, శ్రీనివాస్, నదీం, గోవింద్ రావు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

గాదిగూడ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

నార్నూర్, ఏప్రిల్ 18 : నార్నూర్, గాదిగూడ మండలాల్లో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ మాట్లాడారు. జిల్లా అధికారుల ఆదేశాలతో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గంజాయిని సాగు చేసిన, రవాణా చేస్తు పట్టుబడితే చట్టరీత్యా చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. గురువారం గాదిగూడ మండలం దాబా(కే) గ్రామంలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించగా ఓ వ్యక్తి వద్ద 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.12,500 ఉంటుందని తెలిపారు. నిందితుడినిపై కేసు నమోదు చేశామన్నారు. ఇక్కడ నార్నూర్ సీఐ రహీం పాషా, గాదిగూడ ఎస్ఐ మహేశ్ ఉన్నారు.

గంజాయి జీవితాలను నాశనం చేస్తుంది..

ఎస్పీ గౌష్ ఆలం

కారును తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 18 : భీంపూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ గౌష్ ఆలం సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్, రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా గుంజాల గ్రామాన్ని సందర్శించి మాదకద్రవ్యాలు, గంజాయి వాడకం, రవాణా, పండించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి జీవితాలను నాశనం చేస్తుందని తెలిపారు. గంజాయి పండించడం వల్ల ప్రభుత్వం ద్వారా వచ్చే ఫలితాలు లభించవని తెలిపారు. యువతకు చదువుపై ఆసక్తి కలిగేలా, ఉన్నత లక్ష్యాలను చేరుకునే విధంగా కష్టపడి చదవాలని తల్లిదండ్రులకు, ప్రజలకు సూచించారు. తదుపరి గోవిందుపూర్ గ్రామంలో తిరిగి హనుమాన్ ఆలయ దర్శనం చేసుకున్నారు. ఈ గ్రామంలో గ్రామస్తులు గ్రామాన్ని వదిలి పోవడానికి గమనించిన ఎస్పీ గ్రామంలోని ఎక్కువ శాతం ప్రజలు కిడ్నీ సమస్యతో బాధపడుతుండడంతో వారిని పలకరించి వారి వైద్య రిపోర్టులను పరిశీలించి, వైద్యులను సంప్రదించి దానికి గల కారణాలను తెలుసుకున్నారు. త్వరలోనే జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. తదుపరి మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న భీంపూర్ మండలం కరంజి, తలమడుగు మండలం లక్ష్మిపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను సందర్శించి సిబ్బంది పని తీరును పరిశీలించారు. 24 గంటల అప్రమత్తతో ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బంది తెలిపారు. ఆయన వెంట సీఐ డి.సాయినాథ్, భీంపూర్ ఎస్సై ప్రదీప్‌కుమార్, తలమడుగు ఎస్సై ధనశ్రీ, సిబ్బంది ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై కేసు

ఎదులాపురం, ఏప్రిల్ 18 : అక్రమ నిర్మాణం చేపట్టమే కాకుండా నిర్మాణ పనులు నిలిపివేయాలని వెళ్లిన మున్సిపల్ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై హెడ్‌కానిస్టేబుల్ మురాద్ అలీపై టూ టౌన్‌లో కేసు నమోదు చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రిక్షాకాలనీలో నివాసం ఉండే మురాద్ అలీ పొరుగున నివసిస్తున్న మహ్మద్ అజీంకు చెందిన మెట్లను తొలగించి ప్రహరీ నిర్మించాడని, ఈ విషయమై అజీం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. పలు మార్లు నోటీసులు జారీ చేసినా మురాద్ అలీ స్పందించలేదని మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది వెళ్లి పనులను నిలిపివేయాలని సూచించిన వారితో దురుసుగా ప్రవర్తించి విధులకు అటంకం కలిగించాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్‌లో కేసు నమోదు చేశామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.

కూలిన కలల సౌధం

- రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
- హైదరాబాద్‌లో కాలేజీకి వెళ్తుండగా ప్రమాదం
- ఆటో మీద పడి విరిగిన రెండు కాళ్లు
- చికిత్స పొందుతూ మృతి
- శోకసంద్రంలో పార్డి(కె) గ్రామం

బండెల అజయ్ (ఫైల్)

కుభీర్, ఏప్రిల్ 18 : కలల సౌధం కూలింది. తల్లిదండ్రుల కలల కల్లలయ్యాయి. కాయ కష్టం చేస్తూ ఉన్నత చదువులు చదివిస్తుంటే.. ఆటో ప్రమాదరూపంలో మృత్యువు కబళించింది. జీవిత చరమాంకంలో బాగా చూసుకుంటాడనుకుని అల్లారుముద్దుగా పెంచుకుంటుంటే విధి వక్రీకరించింది. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(కె) గ్రామానికి చెందిన బండెల గజ్జారాం-సునీత దంపతులకు ఒక కూతురు, కుమారుడు బండెల అజయ్(18) ఉన్నారు. పది, ఇంటర్ గురుకుల పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించాడు. దీంతో హైదరాబాద్‌లోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రీ సీటు వచ్చింది. బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. కాగా.. ఇటీవలే స్వగ్రామానికి వచ్చిన అజయ్ మొబైల్ కావాలని తల్లిదండ్రులతో చెప్పాడు. వారు ఫోన్ కొనిచ్చారు. 13వ తేదీ శనివారం ఇక్కడి నుంచి వెళ్లాడు. హైదరాబాద్‌లో కాలేజీకి ఆటోలో వెళ్తున్న అజయ్ పది నిమిషాల్లో కాలేజీకి చేరుకుంటాడనుకునే సమయంలో మృత్యువు వెంటాడింది. కొంపల్లి మైసమ్మగూడలో ఇంకో ఆటో ఎదురుగా వచ్చి అజయ్ ప్రయాణిస్తున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో అజయ్‌పై ఆటో పడడంతో రెండు కాళ్లు విరిగాయి. స్నేహితులు స్థానిక దవాఖానలో చేర్పించారు. ఇక్కడి నుంచి వెళ్లిన కుటుంబ సభ్యులు అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీంతో తండ్రి, తల్లి, తాత, అక్క నాన్నమ్మ రోదనలు గ్రామస్తులను విషాదంలో ముంచెత్తాయి. అజయ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తుప్పు పడుతున్న బైక్‌లు

తుప్పు పడుతున్నాయ్..

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పడుతున్న వాహనాలు

- వేలం నిర్వహించని అటవీ శాఖ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల గండి

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 18 : ఖానాపూర్ అటవీ శాఖ రేంజ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ అయిన వాహనాలు తప్పు పట్టి పోతున్నాయి. కలప, వన్యప్రాణులు, ఇతర కేసుల్లో పట్టుబడిన వాహనాలను అటవీశాఖ రేంజ్, ఫారెస్టు డివిజనల్, ఫ్లయింగ్ అధికారులు సీజ్ చేశారు. ఇందులో లారీలు, ట్రాక్టర్లు, సుమోలు, కార్లు, టాటా మ్యాజిక్‌లు, టాటా ఏస్‌లు, ద్విచక్ర వాహనాలు, బొలేరోలు ఉన్నాయి. వీటి యజమానులకు మూడు దఫాలుగా నోటీసులు కూడా జారీ చేశారు. రాకపోవడంతో ప్రభుత్వ మోటారు వాహన చట్టం ప్రకారం వేలం నిర్వహించాలి. కానీ.. అటవీశాఖ అధికారులు వేలంపై దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండిపడుతున్నది. సకాలంలో వేలం నిర్వహించకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడుస్తూ పాడైపోతున్నాయి. గతంలో 172 వాహనాలకు వేలం నిర్వహించగా రూ.5 లక్షల ఆదాయం సమకూరింది. మిగతావి ఎక్కడివి అక్కడే ఉం డడం గమనార్హం. వీటిలో పనికిరాని వాహనాలను స్క్రాప్ కింద కూడా విక్రయించే అవకాశాలున్నాయి. వేలం పాట చేపడితే ప్రభుత్వానికి లక్షలాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. ఈ విషయమై ఎఫ్ఆర్వో వినాయక్‌ను సంప్రదించగా.. త్వరలో వేలం నిర్వహించే అవకాశాలున్నాయని తెలిపాడు.